క్లుప్తంగా

సచివాలయం తరలింపు ఆపాలని ఫిర్యాదు



కొవ్వూరు ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న 5వ వార్డు కౌన్సిలర్ సాయిగీత, ప్రజలు

తాళ్లపూడి (కొవ్వూరు): పట్టణంలోని 5వ వార్డులో ఉన్న వార్డు సచివాలయం 7వ వార్డులోకి తరలించవద్దని కోరుతూ వైఎస్సార్ సీపీ 5వ వార్డు కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, 5,6 వార్డు ప్రజలు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేశారు. మెరక వీధి సమీపంలోని 5, 6, 7వ వార్డులకు ఉమ్మడిగా ఉన్న సచివాలయాన్ని తమ ప్రాంతానికి దూరంగా 7వ వార్డులోకి మార్పు చేయవద్దని సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద మద్దిపట్ల సాయిగీత, వార్డు మహిళలు వేడుకున్నారు. సచివాలయ మార్పును ఉపసంహరించుకొని యథావిధిగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మహిళలు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రి వనిత పరామర్శ



గుడ్డిగూడెంలో మంగాయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తానేటి వనిత

గోపాలపురం: మండల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు చిన్న తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోట నాగేశ్వరరావును సోమవారం మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తానేటి వనిత పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, నాయకులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, సాలి వేణు, పోతిరెడ్డి నాగరాజు తదితరులు ఉన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

పెరవలి: గ్రామాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే అందుకు ప్రణాళిక అవసరమని, దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ పద్మజ తెలిపారు. నేడు, రేపు నిడదవోలు ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని తెలిపారు. గ్రామాలు ప్రగతి పథంలో పయనించాలంటే అందుకు ప్రణాళిక అవసరమని, దీనికి సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామంలో ఉండే వనరులను బట్టి ప్రణాళిక రూపొందించుకోవటానికి ఈ శిక్షణ అవసరమని అందుకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు.

తలారి వెంకట్రావు పరామర్శ



మీనానగరంలో కార్యకర్త కుటుంబీకులను పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు

చాగల్లు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మీనానగరంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. పార్టీ సీనియర్ కార్యకర్త చింతలపూడి కొండయ్య భార్య అంజలమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, ఎంపీటీసీ తిరుమలరావు, నాయకులు తోట రామకృష్ణ, మేకా రాజు, గెడా శ్యామ్, బొర్రా రజనీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు



దేవరపల్లిలో వంతెన పక్కన కుంగిన ప్రధాన రహదారి

దేవరపల్లి: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న వంతెన వద్ద ప్రధాన రహదారి కుంగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుండుగొలను– కొవ్వూరు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలతో రహదారి రద్దీగా ఉంటుంది. సుమారు 2 మీటర్ల రహదారి కుంగడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు హడలిపోతున్నారు. కుంగిన ప్రదేశంలో ప్రమాద సూచికను ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. రాత్రి సమయంలో వాహనాలు అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.

ఎలకొట్టుడు..!

- మూషికాలతో వరి పంటకు తీవ్ర నష్టం
- రైతులకు అరకొరగా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ
- మరోవైపు తెగుళ్లు, ఎర్రకాలువతో ఆందోళన



డి.ముప్పవరం శివారులో చిరుపొట్ట దశలో ఉన్న వరి పొలాలు

నిడదవోలు రూరల్: ఎలక చిన్నదే.. సాగులో తెచ్చే నష్టం మాత్రం పెద్దది. ప్రస్తుతం పిలక దశలో ఉన్న వరి పంటపై మూషికాల దాడి అధికమైంది. ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలు, మరోపక్క ప్రతికూల పరిస్థితులు, ఇంకో పక్క మూషికాల బెడద కలవరపాటుకు గురి చేస్తోంది. సాగులో అన్నదాతకు ఎలుకలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రారంభ దశలోనే ఇలా ఉంటే పంట చేతి కొచ్చే సమయానికి మరింత నష్టాన్ని చేకూర్చుతాయని రైతన్నల్లో ఆందోళన నెలకొంది. అవి తినే దాని కంటే 7 నుంచి 8 రెట్ల ధాన్యాన్ని అధికంగా పాడు చేస్తాయి. ప్రధానంగా ఖరీఫ్ సమయంలో ఎలుకలు ఎక్కువగా వరి పొలాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయి. ప్రస్తుతం సార్వా పంట చేలు పొట్ట పోసుకొని ఈనిక దశలో ఉన్నాయి. దీంతో పచ్చని చేలపై మూషికాలు దాడికి పాల్పడుతున్నాయి. రైతులు వీటిని ఎదుర్కొనేందుకు ఆర్థిక ఇబ్బందులు పడటంతో పంట దిగుబడిని కోల్పోతున్నారు. నిడదవోలు మండలంలోని 23 గ్రామాల పరిధిలో 16 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఎలుకల నివారణకు వినియోగించే బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం అరకొరగా పంపిణీ చేయడంతో రైతులపై మరింత సాగు భారం పడుతోంది. నిడదవోలు మండలానికి వచ్చిన 80 కేజీల బ్రోమోడయోలిన్ మందును సెప్టెంబర్ 23వ తేదీ నుంచి ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తున్నారు. మండలంలోని సమిశ్రగూడెం, పందలపర్రు, తాళ్లపాలెం, శెట్టిపేట తదితర గ్రామాల్లో వరిపంటపై ఎలుకల దాడి ఎక్కువగా ఉంది. దీంతో ఎకరాకు సుమారు 3 నుంచి 4 బస్తాల వరకు దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామూహిక చర్యలతోనే ఫలితం

మందును ప్రయోగించే ముందు రోజు చేల గట్లపై ఎలుక బొరియలను మూసివేయాలి. మరుసటి రోజు ఏ బొరియలు తెరుచుకుని ఉంటాయో గమనించి అక్కడ ఎలుక ఉందని నిర్ధారణకు వచ్చి అక్కడ వరినూకలు, నూనెలో కలబోసిన బ్రోమోడయోలిన్ మందును పొట్లాల రూపంలో ఉంచాలి. ఎకరాకు 4 గ్రాముల బ్రోమోడయోలిన్ మందులో 96 గ్రాముల వరినూక, 4 గ్రాముల నూనెతో కలగలిపి ఎర తయారు చేయాలి. ముందు రోజు బొరియలను మూసివేయడం వల్ల ఆహారం దొరక్క ఎలుకలు ఖచ్చితంగా వీటిని తింటాయి. దీంతో ఎలుకలను నిర్మూలించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



పందలపర్రులో బ్రోమోడయోలిన్ మందును అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

ఎకరాకు రూ.2 వేల అదనపు భారం

ఎలుకలు వరి దుబ్బులను కొరికేయడం వల్ల పంటలకు నష్టం వాటిల్లి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పూర్తిస్థాయిలో వాటిని నివారించలేకపోతున్నారు. ప్రస్తుతం ఎలుకల నివారణకు ఎకరాకు రూ.2 వేల వరకు అదనపు భారం పడుతోంది. ఎలుకలను పట్టేందుకు బుట్టలు వేయడంతో ఒక్కొక్క ఎలుకను చంపేందుకు రూ.50 నుంచి రూ.70 వరకు తీసుకుంటున్నారు. ఎలుకలు కూడా ఎక్కువగా ఉండటంతో బుట్టలు వేసేవారు రోజుకు రూ.700 పైనే సంపాదిస్తున్నారు.

> **రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> ప్రస్తుతం 60 శాతం పంట పొలాలు చిరుపొట్ట దశలో ఉండటంతో ఎలుకల దాడి ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ద్వారా బ్రోమోడయోలిన్ మందును ఆయా ఆర్ఎస్‌కే కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తున్నాం. మందు వాడకంపై అవగాహన కల్పించి ఎలుకల నిర్మూలనకు కృషి చేస్తాం. ఎలుకలు దాడి చేసి తీవ్రంగా నష్టపరిస్తే దిగుబడిలో ఎకరాకు కనీసం 4 బస్తాలు తగ్గుదల తప్పదు.
>
> – జి.సత్యనారాయణ, వ్యవసాయాధికారి, నిడదవోలు.

వెళ్లిరావమ్మా.. దుర్గమ్మా



దేవరపల్లిలో బాలదుర్గమ్మ విగ్రహాన్ని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

దేవరపల్లి: దసరా మహోత్సవాలు ముగియడంతో ఆలయాలు, మండపాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో వైభంగా ఊరేగించి నిమజ్జనం చేస్తున్నారు. సోమవారం దేవరపల్లిలో బాలదుర్గమ్మ అమ్మవారి విగ్రహం, నిమ్మలపాటి వీధిలోని దుర్గాదేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలపై కోలాహలంగా ఊరేగించారు. గరగ నృత్య ప్రదర్శనలు, కాళికామాతల వేషధారణలు, గొరగేదెల నృత్యాలతో అమ్మవార్లను ఊరేగించి నిమజ్జనం చేశారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

తాళ్లపూడి: గ్రామంలో డ్రెయిన్లు, పింఛన్లు అందజేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వద్ద గ్రామస్తులు ఏకరవు పెట్టారు. మండలంలోని గజ్జరంలో సోమవారం జీఎస్టీపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన పూలపల్లి శ్రీవల్లి పింఛను కావాలని ఎమ్మెల్యేకి మొరపెట్టుకుంది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.

'స్త్రీశక్తి'తో దగా చేసిన చంద్రబాబు



మీనానగరంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు, గిరిజాల బాబు

చాగల్లు: సీఎం చంద్రబాబు తల్లికి వందనం పేరుతో మహిళలను దగా చేశారని, రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం చాగల్లు శివారు మీనానగరంలో జరిగిన సభలో చంద్రబాబు అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరించారు. వెంకట్రావు మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించి పేదలకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీలపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపుల్లో భాగంగా ప్రభుత్వ రంగంలోని నిర్మాణాలను ప్రైవేటుకు అప్పగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో వారిని దగా చేశారని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని, రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దాదాపు ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగ్గొట్టిందని ఆరోపించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ మేకా రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షులు తోట రామకృష్ణ, జాలెం వెంకట్రావు, బొర్రా రజనీప్రసాద్, గేడా శ్యామ్, అయినం నాగరాజు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తా



గుడ్డిగూడెం క్రైస్తవ నాయకులతో మాట్లాడుతున్న తానేటి వనిత

గోపాలపురం: క్రైస్తవ సేవకుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని గతంలో సేవకులకు అందిన గౌరవ వేతనాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తారని మాజీ హోంమంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తానేటి వనిత అన్నారు. మండలంలోని గుడ్డిగూడెంలో సోమవారం తూర్పుగోదావరి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవ ఎం విజయసారధి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ ప్రభుత్వం రాగానే నియోజకవర్గంలోని అర్హులైన దైవ సేవకులందరికీ గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవ సుకుమార్, సుధాకర్, చిట్టిబాబు క్రైస్తవ సంఘ సేవకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టండి



దేవరపల్లి వేలం కేంద్రంలో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ ప్రసాద్

దేవరపల్లి: పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ రైతులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలోని పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2025–26 సంవత్సరానికి బ్యారన్‌కు 3500 కిలోలు పంట ఉత్పత్తి చేయడానికి బోర్డు అనుమతించినట్టు ఆయన తెలిపారు. పరిమితికి లోబడి పంట పండించాలని ఆయన సూచించారు. బ్యారన్‌కు 1.6 హెక్టార్లలో పంట వేయాలన్నారు. పొగాకు సాగు విస్తీర్ణం కుదించుకుని మిగిలిన భూముల్లో పసుపు, మిరప, మొక్కజొన్న, ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి పంటలను వేసుకోవాలని ఆయన సూచించారు. రసాయనాల వినియోగాన్ని విడనాడి ప్రకృతి సేద్య విధానాలను అనుసరించి వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో భూసారం, మితముగా రసాయనిక ఎరువుల వాడకం, భూసారం పెంపొందించుటకు బయో ఫెర్టిలైజర్ వినియోగం, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, డ్రోన్‌ల అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల ఉద్యానవన అధికారి రమేష్ మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ పంటలుగా టిష్యూ కల్చర్, అరటి, కోకో వంటి పంటలు లాభసాటిగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సదస్సులో వేలం నిర్వహణాధికారిణి హేమస్మిత, గోపాలపురం ఏఓ ఏసుబాబు, రెండు వేలం కేంద్రాల పరిధిలోని పొగాకు రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

గేదెల చికిత్సకు రైతులు సహకరించాలి



పెద్దేవంలో గేదెలను పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాస్

తాళ్లపూడి: వ్యాధి బారిన పడిన పాడి పశువులకు చెందిన రైతులు సహకరించడం లేదని, వ్యాధి సోకిన గేదెలు చికిత్సకు వారు సహకరించాలని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పెద్దేవంలో పాడి పశువులకు అంతు చిక్కని వ్యాధి అదుపులోకి రాకపోవడంతో సోమవారం పశువైద్య శాఖ అధికారులు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో కొత్తగా గత రెండు రోజులుగా ఐదు గేదెలకు వ్యాధి సోకింది. జేడీ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలో గేదెలకు నాలుగు రకాల వ్యాధులున్నట్టు గుర్తించామన్నారు. జలగ వ్యాధి, కలుషిత నీరు, పరాన్న జీవులు, ఇతర వ్యాధులు గుర్తించామన్నారు. వ్యాధి సోకిన గేదెల రైతులు తమకు అప్పగిస్తే గోపాలపురం పశు వైద్యశాల వద్ద చికిత్స చేస్తామన్నారు. వ్యాధి సోకిన గేదెలను కబేళాకు అమ్మి వేస్తున్నారని ఇలా చేయడం నేరమన్నారు. రైతులు తమకు నష్టపరిహారం అందజేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి, గ్రామ ఉపసర్పంచ్ తోట రామకృష్ణ, పశువైద్యాధికారులు బాలాజీ, వరలక్ష్మి తదితరులున్నారు.

అక్రమార్జనకు అడ్డాగా కాలువ గట్లు



చెరుకుమిల్లి- పోలవరం కాలువ గట్టుపై చెట్లు నరికేస్తున్న దృశ్యం



పోలవరం కుడి కాలువ గట్టు మట్టిని తరలించిన అక్రమార్కులు

గోపాలపురం: మండలంలోని పోలవరం, తాడిపూడి కాలువ గట్ల వెంబడి ఉన్న చెట్లు, మట్టిని అక్రమార్కులు అమ్ముకుని సొమ్ము చేసుకోవడమే కాకుండా ఆ స్థలాన్ని ఆక్రమించి పంట సాగు చేస్తున్నారు. మండలంలోని పెద్దాపురం, చిట్యాల, చెరుకుమిల్లి, గుడ్డిగూడెం, రాంపాలెం, కొవ్వూరుపాడు, గ్రామాల మధ్య ఉన్న పోలవరం, తాడిపూడి కాలువ గట్లపై ఉన్న చెట్లను అక్రమార్కులు నరికేసి పొగాకు క్యూరింగ్‌కు టన్ను రూ.3,500 నుంచి 4 వేలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు అంటున్నారు. దీనిపై సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, కాలువకు సంబంధించిన అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక నాయకులు పెత్తనం చెలాయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. కొంత కాలంగా పోలవరం కుడి కాలువ ప్రధాన కాలువ గట్టుపై సుమారు రూ.15లక్షల విలువైన మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారని సమాచారం. మెట్టప్రాంతంలో ప్రధాన వాణి పంట అయిన వర్జీనియా పొగాకు అవసరమైన కలపను రైతులకు అందించడానికి కొంత మంది దళారులు కాలువ గట్లపై ఉన్న చెట్లను నరికి అమ్ముకుంటున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా కాలువ గట్లపై ఉన్న చెట్లను, మట్టిని తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామానికి చెందిన మద్దాల వెంకట అప్పారావుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందింది. ఉదయం మేతకు వెళ్లిన ఈ గేదె సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో తిరిగి వస్తుండగా, రాపాక – కోటికేశవరం రోడ్డులో రాపాక శివారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు తెగి దానిపై పడింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పశు వైద్యులు ఘటనా స్థలంలో గేదెకు పోస్టుమార్టం నిర్వహించారు. దాని విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పాడి రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఆర్ట్స్ కళాశాలలో దీక్షారంభం కార్యక్రమం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. దీనికి జోన్ 1, 2 ఆర్జేడీ డాక్టర్ పీవీ కృష్ణాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి, విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలు, గొప్ప విద్యావేత్తలు ఆర్ట్స్ కళాశాలలో విద్యను అభ్యసించారన్నారు. కళాశాలలోని స్కాలర్‌షిప్‌లు, ల్యాబ్‌లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సర్వీసులు, జేకేసీ ఉద్యోగ అవకాశాలను వివరించారు.

ఏడేళ్లయినా కొలిక్కిరాని విచారణ

- ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు రికార్డులు

నల్లజర్ల: ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏటా చేసిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటారు. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు చేసే చిన్న చిన్న తప్పిదాలను వెతికి పట్టుకొని వెంటనే దుర్వినియోగం అయిన సొమ్మును తిరిగి ఉపాధి ఖాతాకు జమ చేయిస్తుంటారు. ఈ విషయంలో ఒక అధికారే నిధులు దుర్వినియోగం చేస్తే అతీగతీ లేదు. ఈ సంఘటన జరిగి అప్పుడే (2018–19) ఏడేళ్లైంది. అప్పట్లో ఎంపీడీఓ, ఉపాధి హామీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ అయిన టి.సూర్యనారాయణ ఈ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు సోషల్ ఆడిట్ బృందం ధ్రువీకరించింది. ఈ విషయంలో ఒక ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెండ్ అయ్యారు. నిధులు స్వాహా చేసిన సూర్యనారాయణను అప్పట్లో కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. ఆయనపై డ్వామా పీడీ, విజిలెన్స్ ఎంక్వైరీ జరిగింది. కానీ నేటికీ ఆ డబ్బు తిరిగి రాబట్టలేకపోయారు. తాజాగా దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. రికార్డులు పరిశీలన చేసి చెక్ బుక్‌లో ఆయనే స్వయంగా సంతకం చేసి నిధులు డ్రా చేసినట్టు గుర్తించారు. దీంతో అప్పట్లో ఆయన పనిచేసిన సమయంలో రికార్డుల్లో ఉన్న సంతకాలు, చెక్‌బుక్‌పై ఉన్న సంతకాలు ఒకటా? కాదా? అన్న విషయం తేల్చడానికి మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ.6 వేలు మంగళగిరిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చెల్లించి రికార్డులను మంగళవారం మంగళగిరి తీసుకెళుతున్నట్టు ఎంపీడీఓ సత్యనారాయణ వెల్లడించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మారెళ్లమూడిలో రజక సంఘ సమావేశంలో మాట్లాడుతున్న పోసిబాబు

నల్లజర్ల: ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సీఎం చంద్రబాబు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీఎంఆర్ఎస్ అధ్యక్షుడు చాటపర్తి పోసుబాబు డిమాండ్ చేశారు. మండలంలోని మారెళ్లమూడిలో సోమవారం గ్రామ సంఘం అధ్యక్షుడు కోటిచుక్కల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన రజకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, మన రాష్ట్రంలో కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆయన కోరారు. రజకులంతా ఐకమత్యంతో ఉండాలన్నారు. రజకుల సమస్యలపై పోరాటంతో పాటు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి అన్ని జిల్లాలు పర్యటిస్తున్నట్టు వివరించారు. అసెంబ్లీలో, శాసన మండలిలో ఈ విషయం ప్రస్తావించిన సోము వీర్రాజు, గల్లా మాధవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టేకి అప్పారావు, కోటిచుక్కల గంగరాజు, వేల్పూరు శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్‌కు రేపు అంతరాయం

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్డీఎస్ఎస్ పనుల నిర్వహణ నిమిత్తం ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రకాశరావుపాలెం టౌన్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు నిడదవోలు సెక్షన్ ఈఈ నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

అదుపు తప్పి.. డివైడర్ పైకెక్కి..



బొమ్మూరు వద్ద జాతీయ రహదారి డివైడర్ పైకి ఎక్కేసిన వాహనం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి బొమ్మూరు వద్ద డివైడర్ పైకి సోమవారం మధ్యాహ్నం ఓ జీపు దూసుకుపోయింది. వేమగిరి వైపు నుంచి బొమ్మూరు వైపు వస్తున్న ఆ వాహనం సుద్దగని వద్దకు వచ్చేసరికి అతి వేగం కారణంగా అదుపు తప్పింది. డివైడర్‌పై బలమైన ఇనుప తీగలు కట్టి ఉండడంతో అక్కడికక్కడే నిలిచిపోయింది. లేకపోతే ఇవతల రోడ్డులోకి వచ్చిఉంటే ప్రమాదం భారీగా జరిగేది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు. జీపు అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.